క్లుప్తంగా

కల్యాణోత్సవాలు ప్రారంభం



టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతీ సమేత రామేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త యడవల్లి నీలలోహిత శాస్త్రి ఆధ్వర్యంలో రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి బ్రహ్మత్వంలో ఉదయం మహోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయం తరఫున నీలలోహిత శాస్త్రి దంపతులు స్వామి వారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. పీటలపై కూర్చుని ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

20న ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పెడన: విజయవాడ సమీపంలోని కొండపల్లి సెలబ్రిటీ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని విజయానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విజయానంద డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారు అర్హులన్నారు. 2020 నుంచి 2023 ఏడాది వరకు ఉత్తీర్ణులైన డిగ్రీ, పీజీ అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు, ఫెయిలైన వారు అర్హులని, వీరు కూడా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94930 18225, 90002 15737 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చిరు వ్యాపారులకు గొడుగులు వితరణ



మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రధాన వీధిలో చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. వేసవి ఎండ తీవ్రత నుంచి చిరు వ్యాపారులకు నీడ నిచ్చేందుకు గొడుగులను పంపిణీ చేశామని క్లబ్ ప్రతినిధి యెండూరి సురేష్ తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రోడ్ల వెంబడి పూలు విక్రయించే మహిళలకు, చర్మకారుడు కిషోర్‌కు గొడుగులు అందజేశామని తెలిపారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, క్లబ్ అధ్యక్షుడు అన్నం అశోక్, కార్యదర్శి తమ్మన పవన్, కోశాధికారి మాటూరి దీపు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఘంటసాల(అవనిగడ్డ): మండల పరిధిలోని దేవరకోటలో ఉపాధి హామీ పనులను బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వాకా రామచంద్రరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 29వ తేదీన మచిలీపట్నంలో జరిగే జిల్లా సమావేశానికి అందరూ రావాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ అభిలాష్, వోలేటి సురేష్, కొడాలి లక్ష్మి, వీరంకి సీతమ్మ, కొడాలి అరుణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని డిపో మేనేజర్ పి. పెద్దిరాజు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ నాయకులు డి. కృష్ణ, పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు చేయాలి

పామర్రు: రాష్ట్రంలో 2022–23 సంవత్సరానికి (1432వ ఫసలీ) నీటి తీరువా వసూళ్లు వెంటనే ప్రారంభించాలని సామాజిక కార్యకర్త జె.శ్రీనివాస గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2022 జూలై 1 నుంచి వసూలు ప్రారంభించాల్సిన తీరువా(ఎకరానికి రూ.200) వసూలుకు రాష్ట్ర రెవెన్యూశాఖ ఏపీ సేవా పోర్టల్‌లో చెల్లించేందుకు ఇంతవరకు ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదన్నారు. నీటితీరువా శిస్తు రోజు పుస్తకాలను వీఆర్వోలకు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితులలో నీటి తీరువా వసూలుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(మంగళగిరి) తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తాను ఈ విషయమై మార్చి 18న లోకాయుక్తకు ఫిర్యాదుచేయగా, లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దీనిపై నివేదిక ఇవ్వవలసిందిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

నిప్పుల కుంపటి

- ఉదయం 7 గంటలకే సూర్యుడి ప్రతాపం
- అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- వడగాడ్పులతో అల్లాడుతున్న ప్రజలు
- ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు



నిర్మానుష్యంగా మారిన కోడూరు ప్రధాన రహదారి

కోడూరు/కోనేరు సెంటర్: భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఉదయం 7 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. సముద్రతీరానికి అతి సమీపంలో ఉండే దివిసీమ ప్రాంతంలో, బందరులో కూడా ఎండల తీవ్రత అధికంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కోడూరు మండలంలో సోమ, మంగళవారాల్లో వరుసగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో పాటు వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బందరులో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఫ్యాన్ వేస్తే వేడిగా వస్తున్న గాలితో పాటు ఉక్కపోతతో ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండల తీవ్రతతో ప్రధాన కూడళ్లు, వ్యాపార సంస్థలు ప్రజలు లేక వెలవెలబోతున్నాయి. చిరు వ్యాపారులు తమ దుకాణాలను మూసి వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో అత్యవసరంగా ప్రయాణాలు చేసే వారు తలకు, మొఖానికి చేతి రుమాలాలు, కాటన్ మాస్క్‌లు ధరించి వెళ్తున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఎండ తీవ్ర కొనసాగుతోంది. వేడిగాలులు రాత్రి 8 గంటల వరకు వీస్తున్నాయి. శీతల పానీయాలకు, కొబ్బరి బొండాలకు డిమాండ్ ఏర్పడింది.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు..

ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో వడ దెబ్బ కేసులు గణనీయంగా పెరగడంతో పాటు ఎండ తీవ్రతతో పలువురికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాకుండా ఇళ్ల వద్దే ఉండాలన్నారు. గొంతు పొడిబారకుండా ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు.



తలపై ముసుగు వేసుకొని వెళ్తున్న మహిళ



ఎండలో వాహన చోదకుల కష్టాలు

రోహిణికార్తెకు ముందుగానే ..

సాధారణంగా రోహిణికార్తెలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అయితే ఈ ఏడాది రోహిణికార్తె రాక ముందే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోహిణికార్తెకు వారం రోజుల ముందుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వడగాడ్పులు వీస్తుండటంతో ప్రజలు ఎండతీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందంటూ వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

హజ్రత్ నిర్గన్‌షా దర్గాకు పోటెత్తిన భక్తులు

- ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కిటకిటలాడిన దర్గా ప్రాంతం



చాదర్‌ను సమర్పిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన హజ్రత్ నిర్గన్ షా అవులియా దర్గా ఉరుసు ఉత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బుధవారం అధిక సంఖ్యలో దర్గాకు తరలివచ్చారు. బాబాను దర్శించుకుని ప్రార్థనలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్గా పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు మొదటి రోజు గంధోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి దర్గా నుంచి ప్రారంభమైన ఊరేగింపు వీధుల్లో తిరుగుతూ బుధవారం తెల్లవారు ఝామును తిరిగి దర్గాకు చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా దర్గా ఆవరణలో కాంపిటీషన్ ఖవ్వాలీ ఏర్పాటు చేశారు. నాగపూర్‌కు చెందిన ఆఫ్రిన్ రంగేలి, ముంబాయికి చెందిన మోయిన్ నాజ్ బృందాలు ఖవ్వాలీతో అలరించారు. దర్గాకు భక్తులు పోటెత్తడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెడన సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో గూడూరు ఎస్ఐ వీరమల్లు వెంకటేష్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మంత్రి జోగి రమేష్ ప్రత్యేక ప్రార్థనలు..

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని బాబాను కోరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, నాయకులు గోరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావు, దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో నైపుణ్యం వెలికితీత



విద్యార్థులు తయారుచేసిన బొమ్మలను పరిశీలించి అభినందిస్తున్న జిల్లా గ్రంథాలయాధికారి

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్ వస్తువులను గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి జి. రవికుమార్ పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థులు పేపరు, ఇతర వస్తువులతో తయారు చేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయని రవికుమార్ చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గుండుగొలను శాఖా గ్రంథాలయంలో చదువుకుని ఐఏఎస్ టాపర్‌గా నిలిచి నేడు రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన సెక్రటరీగా ఎదిగిన ముత్యాలరాజును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పి.. యోగా భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పారు. జి. దుర్గాభవాని లెక్కలు, ఉమా సరస్వతి దేశభక్తి గీతాలు నేర్పించారు. విద్యార్థులు మ్యూజికల్ చైర్ ఆటను ఉత్సాహంగా ఆడారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఉమా శంకర్ బ్యాంక్ లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాలను జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎన్‌వీడీటీ నరేష్ పర్యవేక్షించారు. అలాగే నగరంలోని చిలకలపూడి, ఈడేపల్లి శాఖా గ్రంథాలయాల్లో కూడా వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు.

ఆక్వా అభివృద్ధికి ఎంతో కృషిచేశాం

ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్ర ప్రభుత్వం చెయ్యలేని విధంగా నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్వా ట్రేడర్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతులను ఆదుకునేందుకు చిన్న రైతులకు విద్యుత్ వాడకంలో 50 శాతం రాయితీ ఇచ్చిందన్నారు. దీంతో రైతుకు ఏడాదికి కనీసంగా రూ.1.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ప్రతి ఏటా మేలు జరుగుతుందన్నారు. దీంతో రైతుకు సాగుభారం తగ్గుతుందనే ఆశతో ఎక్కువ మంది ఆక్వా వైపు మొగ్గు చూపుతారన్నారు. తద్వారా ఆక్వా ఎగుమతులు పెరిగి, రైతుకు మేలు జరగడంతో పాటు రాష్ట్రానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆక్వా ట్రేడర్స్ చైర్మన్ పాతపాటి నగ్రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, దత్తాబయో మెడికల్ జీఎం కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

చల్లపల్లి: వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో వృద్ధులు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ కేవీ పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక పార్వతమ్మ తోటలో ఆదరణ గృహం వృద్ధాశ్రమంలో పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరం నిర్వహించారు. డాక్టర్ పద్మావతి వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను నెలకు సరిపడా అందజేశారు. సీహెచ్‌ఓ కె.సుమతి, సూపర్‌వైజర్ కమలాకర్, ఎంఎల్‌హెచ్‌పీ డి.గౌతమి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

● హమ్మయ్యా.. దాహం తీరింది

వేసవి ఎండలకు దాహంతో జీవాలు అల్లాడుతున్నాయి. బుధవారం వీధుల్లో తిరిగే గోమాతకు దాహం వేసి నాగాయలంక ఏడో వార్డుకు చెందిన వస్త్ర వ్యాపారి రాచంశెట్టి పాపారావు ఇంటి ఆవరణలోకి వచ్చింది. ఇంటి ఆవరణలో ఉన్న కుళాయిని నాలుకతో తిప్పి వచ్చిన నీటిని తాగుతూ ఇబ్బంది పడింది. ఈ దృశ్యాన్ని చూసిన పాపారావు వెంటనే బక్కెట్‌లో నీటిని పట్టి గోమాత దాహాన్ని తీర్చాడు. పశువుల దాహార్తి తీర్చేందుకు రోడ్ల పక్కన అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపాలని, ఇందుకు పంచాయతీవారు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పాపారావు కోరారు.

– నాగాయలంక



కుళాయి తిప్పి నీటిని తాగుతున్న గోమాత

గృహ నిర్మాణాలు పూర్తిచేయండి

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 ఎకరాల భూమిని సేకరించి జగనన్న గ్రీన్ విలేజ్‌లో 3000 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. తక్కువ ఖర్చుతో నూతన టెక్నాలజీతో ఇంటి నిర్మాణాలకు అర్త సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంస్థ నిర్మించిన మోడల్ గృహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ విలేజ్‌లో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించామని చెప్పారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డీఎన్నార్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవానికీ ఇంటి పట్టాలు అందించడమే కాకుండా నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని చెప్పారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని కితాబిచ్చారు. కార్యక్రమంలో దూలం వినయ్‌కుమార్, లబ్ధిదారులు, అర్త నిర్మాణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

● సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మత్స్యకారులను ఆదుకుంటున్న ప్రభుత్వం

- మంత్రి జోగి రమేష్
- పెడన నియోజకవర్గంలో 1381 మందికి నిధులు జమ

పెడన: పెడన నియోజకవర్గంలోని 1,381 మంది మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా కల్పించింది. చేపల వేట నిషేధ భృతి కింద రూ.1,83,10,000 నగదును ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున వారి ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వేట నిషేధ సమయంలో కుటుంబ పోషణకు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం వారికి నిధులు విడుదల చేసిందని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. టీడీపీ హయాంలో మత్స్యకారుల మరబోట్లకు డీజిల్‌పై సబ్సిడీ ఆరు రూపాయాలు మాత్రమే ఇచ్చేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం సబ్సిడీని రూ.9 చేశారన్నారు. అలాగే వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణిస్తే టీడీపీ హయాంలో రూ.5 లక్షలు ఇచ్చేవారని, ఇప్పుడు దానిని రూ.పది లక్షలు చేశారని చెప్పారు. మత్స్యకారుల పట్ల సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపిస్తున్న ఆదరణను చూసి టీడీపీ వారు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, రూ.16 వేల కోట్లతో నాలుగు పోర్టులను నిర్మించేలా చర్యలు చేపట్టారని వివరించారు. మత్స్యకారులకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ నెల 22న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం పోర్టు పనులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేస్తారని, ఆయా కార్యక్రమాల్లో మత్స్యకారులు పాల్గొని జయప్రదం చేయాలని మంత్రి కోరారు.

సాయినాథునికి మంత్రి అంబటి పూజలు



సాయినాథుని సన్నిధిలో మంత్రి రాంబాబు, నాగమల్లేశ్వరరావు దంపతులు

కమ్మనమోలు(నాగాయలంక): స్థానిక గణపతి దత్తాత్రేయ సమేత సమర్థ సద్గురు షిర్డీ సాయినాథుని ఆలయం షష్ఠమ వార్షికోత్సవ వేడుకల్లో బుధవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. దేవస్థానం అర్చకుడు దివి పార్థసారథి ఆచార్యులు బ్రహ్మత్వంలో లోక కల్యాణార్థం మంత్రి విశేష పూజాదికాలు చేశారు. తొలుత పెద్దింటి అనిల్ కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ వ్యవస్థాపకులు బండ్రెడ్డి నాగమల్లేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పంచామృత సహస్ర కలశారాధన, దత్తాత్రేయ సహిత శ్రీసాయి గాయత్రి ప్రధాన హోమాలు, మహా శాంతి హోమం జరిపారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. డీసీపీ బాబూరావు (విజయవాడ), బండ్రెడ్డి నరసింహారావు, శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి జగన్

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

పెడన: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తూ ముస్లింల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. హజ్ యాత్రికులు గన్నవరం నుంచి ప్రయాణించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం, రూ.80 వేల సబ్సిడీని ప్రభుత్వమే భరించేలా చర్యలు చేపట్టడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం మైనార్టీలకు చేసింది ఏమి లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రం నుంచి 1,821 మంది హజ్ యాత్రికులకు సబ్సిడీ కింద రూ.14.51 కోట్ల నగదు వారి ఖాతాలకు జమ చేసిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కోడూరు శ్రీనివాసరావు, అజిమ్‌పాషి, హనీఫ్‌ఖాన్, మున్నా, మతీన్‌ఖాన్, ముస్లిం ప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఎండీయూ ఆపరేటర్ల కృతజ్ఞతలు



జేసీ అపరాజితసింగ్, డీఎస్‌ఓ పార్వతిలకు మొక్కను అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): సమస్యలను చెప్పిన వెంటనే పరిష్కరించారని, దీనికి తామంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పింది శ్యాంబాబు అన్నారు. ఎండీయూ ఆపరేటర్లు జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఎస్‌ఓ పార్వతిలను బుధవారం కలిసి పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. శ్యాంబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమకు ఎండీయూ వాహనాలను ఇచ్చి ఉపాధి కల్పించారని, వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు. అంగన్‌వాడీ పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం సరుకులను సరఫరా చేసినందుకు కూడా నగదు చెల్లిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ డి. సునీల్‌బాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చల్లపల్లి: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ సీహెచ్ చినబాబు బుధవారం ప్రారంభించారు. అవనిగడ్డ మాజీ జెడ్పీటీసీ, దివంగత అడపా రామకోటి జ్ఞాపకార్థం గ్రామ ప్రముఖులు అడపా రవి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలి రోజు ప్రయాణికులకు, ఆటో, రిక్షా కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు.